నవనాథపురి.. ఇదేం కిరికిరి?

బల్దియాలో సర్కారు వారి అ'రాజకీయం'!

నిజామాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) ఆర్మూర్ మున్సిపల్ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారికంగా ప్రకటించాక, ఇప్పుడు పిల్లిమొగ్గలు వేస్తుండడం చర్చనీయాంశమైంది. మున్సిపల్ చైర్పర్సన్ పదవిలో ఉన్నారో.. లేరో తెలియక తీవ్ర ఉత్కంఠ కొనసాగుతున్నది. అసలు ఈ గందరగోళానికి బాధ్యులు ఎవరన్నది ఇప్పుడు సర్వత్రా చర్చ జరుగుతున్నది. ఉన్నతాధికారుల సమక్షంలో అత్యంత సాఫీగా జరగాల్సిన ప్రక్రియ తీవ్ర వివాదాస్పదం కావడం విస్తుగొల్పుతున్నది. చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, నిబంధనలను అమలుచేయాల్సిన వారే పప్పులో కాలేసి తీవ్రమైన పాలన సంక్షోభాన్ని సృష్టించడం గమనార్హం. అధికారులు, రాజకీయ నేతలు ఇష్టారాజ్యంగా ఎవరికి తోచినట్లు వారు వ్యవహరించడంతో గందరగోళం ఏర్పడింది. వాస్తవానికి అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ చేపట్టాలంటే ఎంత మంది సమావేశానికి హాజరు కావాలి.. తీర్మానానికి ఎంత మంది మద్దతు ఉండాలి? అందులో ఎవరెవరిని విశ్వాసంలోకి తీసుకోవాలి? కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తికి సంబంధించిన ఓటింగ్ ప్రక్రియ ఏమిటి? తదితర వివరాలేవి పట్టించుకోకుండా అవిశ్వాస ప్రక్రియను అమలు చేసి, నిలుపుదల చేస్తుండడం అనుమానాలకు తావిస్తున్నది. రాజకీయ జోక్యం కారణంగానే ఈ దుమారం రేగిందన్న చర్చ జరుగుతున్నది.


అవిశ్వాసం నెగ్గినట్లు ఆర్డీవో కలెక్టర్‌కు పంపిన నివేదిక


చైర్పర్సన్ స్థానం ఖాళీ అయినట్లు ఈసీకి కమిషనర్ పంపిన లేఖ

- తీర్మానం నెగ్గిందని మొదట్లో ప్రకటనలు..
- ఇప్పుడేమో వీగిందని పిల్లిమొగ్గలు?
- రాజకీయ జోక్యంతో నాటకీయ పరిణామాలు
- చట్టాన్ని అమలు చేయడంలో సర్కారు వైఫల్యం
- రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారితీసిన ఆర్మూర్ అవిశ్వాసం

పరస్పర విరుద్ధ ప్రకటనలు..

ఆర్మూర్ మున్సిపాలిటీ అవిశ్వాస ఎపిసోడ్‌లో రెండు రకాల ప్రకటనలు రావడం విస్మయానికి గురి చేస్తున్నది. జనవరి 4వ తేదీన అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఇద్దరు స్వతంత్రులు కలిపి మొత్తం 24 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఇక, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు. మొత్తం 36 మంది కౌన్సిలర్లలో 2/3 వంతు (24 మంది) హాజరు కావడంతో అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించారు. 24 మంది తీర్మానానికి మద్దతుగా చేతులెత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు అదేరోజున అధికారికంగా వెల్లడించారు. మున్సిపల్ చైర్పర్సన్ తన పదవిని కోల్పోయినట్లు డిసిగ్నేటెడ్ ఆఫీసర్ హోదాలో ఆర్డీవో వినోద్‌కుమార్ ప్రకటించారు. ఇదే అంశాన్ని కలెక్టర్‌కు నివేదిక రూపంలో పంపించారు. పురపాలక శాఖ, ఎన్నికల సంఘానికి సైతం అవిశ్వాసం నెగ్గినట్లు సమాచారాన్ని చేరవేశారు. జనవరి 16న ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ సైతం ప్రభుత్వానికి పంపిన లేఖలోనూ అవిశ్వాసం నెగ్గినట్లు సంతకం చేశారు. ఆర్మూర్ మున్సిపల్ కౌన్సిల్ తీర్మాన ప్రతిని ఆధారం చేసుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ సైతం జనవరి 22న నూతన చైర్మన్ ఎన్నికను చేపడుతున్నట్లుగా బదులిచ్చారు. అంటే మున్సిపల్ చైర్పర్సన్ పండిత్ వినీత తన పదవిని కోల్పోయినట్లు జనవరి 22వ తేదీ దాకా అటు ప్రభుత్వ వర్గాలు, ఇటు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా గుర్తించింది. కానీ ఏం జరిగిందో కానీ.. 22వ తేదీ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కొత్త చైర్పర్సన్ ఎన్నిక నిర్వహించాల్సిన తరుణంలో.. అవిశ్వాస ప్రక్రియ వీగిపోయినట్లు ప్రకటనలు రావడంతో గందరగోళం ఏర్పడింది. అసలేం జరిగిందో తెలియక కౌన్సిలర్లు సైతం తికమక పడుతున్నారు. ఇది ముమ్మాటికీ చట్ట ఉల్లంఘన కిందికి వస్తుందంటూ వారంతా మండిపడుతున్నారు. అవిశ్వాసం నెగ్గిందని ఆ రోజు ప్రకటించిన అధికారులు.. ఇప్పుడు అవిశ్వాసం వీగిపోయిందని వస్తున్న వార్తలపై ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నిస్తున్నారు. చట్టంలోని నిబంధనలను ఒకసారి అమలుచేసి, వెనక్కి తీసుకోవడంపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీవోతో పాటు ఉన్నతాధికారులు సైతం పొరపాట్లు చేసి అందరినీ గందరగోళంలోకి నెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్పష్టత ఏది?

ఆర్మూర్ మున్సిపాలిటీలో డ్రామా జరుగుతున్నప్పటికీ ఈ వ్యవహారంపై అధికారులెవ్వరూ స్పష్టత ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. మరోవైపు, చైర్పర్సన్ వినీత సోమవారం మున్సిపాలిటీకి వచ్చితానే చైర్మన్ అని ప్రకటించుకున్నారు. ఈమెకు దీటుగా 24మంది కౌన్సిలర్లు ఈ వ్యవహారాన్ని తీవ్రంగా తప్పుపడుతూ మున్సిపాలిటీలోనే సమావేశమై ప్రకటన విడుదల చేశారు. ఇరు వర్గాల మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణానికి పుల్‌స్టాప్ పెట్టాల్సిన ప్రభుత్వ యంత్రాంగం మాత్రం చేష్టాలుడిగి చూస్తున్నది. మొత్తానికి అవిశ్వాస ప్రక్రియ మూలంగా కాంగ్రెస్ నేతల జోక్యంతో ఆర్మూర్ బల్దియాలో పరిపాలన స్తంభించింది. పట్టణవాసులకు అందాల్సిన ప్రజాసేవలు అందడంలో వైఫల్యం, జాప్యం జరుగుతున్నది. ఇంత జరుగుతున్నప్పటికీ బీజేపీకి చెందిన ఎమ్మెల్యే మాత్రం నోరు మెదపడం లేదు. మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీ నేతపై తీవ్రస్థాయిలో విరుచుకు పడిన పైడి రాకేశ్‌రెడ్డి అవిశ్వాస తీర్మానంలోని నాటకీయతపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం విశేషం.

రాజకీయ జోక్యంతోనే..

ఈ వ్యవహారంలో అధికార పార్టీ నేతల జోక్యంతోనే ఇదంతా జరుగుతున్నదని కౌన్సిలర్లు, ప్రజలు అనుమానిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే సారథ్యంలో జరిగిన అవిశ్వాస తంతు విజయవంతమైతే ఎక్కడ తమ పరువు పోతుందోననే ఆలోచనతోనే.. ఇటీవలి ఎన్నికల్లో ఓటమి పాలైన ఓ నాయకుడు ఇదంతా చేయిస్తున్నారన్న చర్చ నడుస్తున్నది. కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన పైడి రాకేశ్‌రెడ్డి సైతం అవిశ్వాస ప్రక్రియలో పాల్గొన్నారు. ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఓటు హక్కు కలిగి ఉన్న ఎమ్మెల్యే ఓటు వేయకుండానే తటస్థంగానే ఉన్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత బయటికి వచ్చిన ఆయన.. అవినీతి ఓడిందని కీలక వ్యాఖ్యలు చేశారు. అయితే, ఎమ్మెల్యే ఓటు విషయంలో గందరగోళం చోటు చేసుకుంటుండగా, ఆయన చేతులు ఎత్తక పోవడంతోనే అవిశ్వాసం వీగినట్లుగా ప్రచారం జరుగుతున్నది. అవిశ్వాస తీర్మాన సమావేశంలో ఎమ్మెల్యే ఓటును పరిగణనలోకి తీసుకోలేదు. 24మంది ఓట్లతో మెజార్టీ వచ్చినట్లుగా నిర్ధారించారు. ప్రస్తుతం రాజకీయ జోక్యం మూలంగా ఎమ్మెల్యే ఓటును జోడించారు. దీంతో కౌన్సిలర్లు 36 మంది, ఎమ్మెల్యే కలిపితే 37 మంది అవుతున్నారు. ఇందులో 2/3 మెజార్టీ అంటే 25 మందిగా ప్రభుత్వం వాదిస్తున్నది. ఈ మేరకు కలెక్టర్‌కు ఆదేశాలు సైతం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతల జోక్యం మూలంగానే ఇంతటి హైడ్రామా జరిగినట్లుగా ఆర్మూర్ పట్టణ వాసులు బహిరంగంగానే చెబుతున్నారు.

కుట్ర ప్రకారమే..

అవిశ్వాసం విషయంలో కుట్ర జరుగుతున్నదని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అవిశ్వాసం నెగ్గిందని ప్రకటించిన నెల తర్వాత ఇప్పుడు వీగిపోయిందనడం హాస్యాస్పదమన్నారు. ఇంతటి సంక్షోభానికి కారణమైన ఉన్నతాధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.


మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటా..

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపిద్దాం..
గ్రామగ్రామాన తిరిగి సర్పంచులుగా గెలిపిస్తా..
నియోజకవర్గ ప్రజలకు కష్టసుఖాల్లో తోడుగా ఉంటా
బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి
బీర్కూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

బాన్సువాడ, ఫిబ్రవరి 7: బీఆర్ఎస్ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామగ్రామాన తిరిగి సర్పంచులుగా గెలిపిస్తానని అన్నారు. ప్రతి గ్రామంలో చేసిన అభివృద్ధిని ప్రజలందరికీ వివరిస్తూ ఓట్లు అడుగుతానని పేర్కొన్నారు. బీర్కూర్ చౌరస్తాలోని ఎస్ఎంబీ ఫంక్షన్‌హాలుగా బుధవారం నిర్వహించిన బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిజాంసాగర్ నీటి ని విడుతల వారీగా విడుదల చేస్తున్నారని, ఎకరం భూమి ఎండిపోకుండా చూస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగరాలన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి రాష్ట్రం లో మరెక్కడా జరగలేదని తెలిపారు. బాన్సువాడ అభివృద్ధిలో దూసుకెళ్తున్నదని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు.

అబద్ధాలతో పబ్బం గడుపుతున్న 'ఏనుగు'

ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి ఎర్రపహాడ్ గ్రామంలో ఒక్కరికీ డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టించలేదని, ఆయన ఇంటి ఎదుట ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం పడిపోతున్నా నిర్మించలేదని ఆరోపించారు. అక్కడి ప్రజలు తరిమిస్తే సిగ్గు లేకుండా బాన్సువాడకు వచ్చి పచ్చి అబద్ధాలు ఆడుతూ పబ్బం గడుపుకుంటున్నాడని విమర్శించారు. బీర్కూర్ పట్టణ శివారులో కాలువ సరిగా లేక సాగునీరు అందడం లేదని ఆలోచించి నూతన కాలువ నిర్మాణం కోసం సుమారు రూ. కోటీ 15 లక్షల మంజూరుచేయించినట్లు గుర్తుచేశారు.రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రూ.150 కోట్లతో బాన్సువాడ నియోజకవర్గంలో డిస్ట్రిబ్యూటరీ కాలువలను నిర్మించి, రైతులకు న్యాయం చేసినట్లు తెలిపారు. కానీ ఏనుగు రవీందర్‌రెడ్డి సిగ్గులేకుండా తనపై బురుదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చినట్లు చెప్పారు. రాజ్యాంగం ప్రకారం ప్రొటోకాల్ పాటించాల్సిందే అని, ఏ మాత్రం తేడా వచ్చినా ఊరుకునే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. మర్యాద ఇచ్చిపుచ్చుకునేలా ఉండాలన్నారు.బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరిగినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పుడు తాను ఎవరిపై వ్యక్తిగతంగా కక్ష సాధించలేదని తెలిపారు. తాను కక్ష సాధిస్తే ఎవరూ మిగిలేవారు కాదని, తాను అలాంటి వాడిని కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటే ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.అనంతరం నియోజక వర్గంలోని సర్పంచుల పదవీకాలం పూర్తయిన సందర్భంగా వారిని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పోచారం, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, విండో చైర్మన్ ఏర్వాల కృష్ణారెడ్డి, జిల్లా బంజార సేవాసంఘం అధ్యక్షుడు బద్యానాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ మోహన్‌నాయక్, మహ్మద్ ఎజాస్, ఎంపీపీ దొడ్ల నీరజా వెంకట్రామ్ రెడ్డి, ఎంపీపీ రఘు తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ చేస్తా

డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి

పార్టీ అధిష్ఠానం అవకాశం ఇస్తే తాను ఎంపీగా పోటీ చేస్తానని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల జోలికి వస్తే సహించేదిలేదని హెచ్చరించారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్తకు తమ కుటుంబం అండగా ఉంటుందన్నారు. ఎలాంటి కష్టం వచ్చినా తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

మాచారెడ్డి మండలం సోమారంపేట్ గ్రామానికి చెందిన యువ రచయిత, భారత జాగృతి కామారెడ్డి జిల్లా సాహిత్య విభాగం కో -కన్వీనర్ కళ్లెం నవీన్ రెడ్డి రాసిన 'యోధ' కవితా సంపుటిని మాజీ సీఎం,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పోరాట పటిమ, తెలంగాణ తెచ్చిన నాయకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పదేండ్ల పాటు ప్రజల కోసం పనిచేసిన కేసీఆర్ నేపథ్యాన్ని నవీన్‌రెడ్డి పుస్తక రూపంలో తీసుకువచ్చారు. కేసీఆర్ పోరాట స్ఫూర్తి, ఆయన ఆలోచనలను పుస్తకంలో సవివరంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డిని కేసీఆర్ అభినందించారు. మాజీ స్పీకర్ పోచారం, మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.
-కామారెడ్డి, ఫిబ్రవరి 7

ప్రజాసమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 7: నియోజకవర్గ ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు హెల్ప్‌లైన్ (7207976565, 7032225344)ను ప్రారంభించారు. 'మదనన్న మాట' (మీ సమస్య -నా బాధ్యత) పేరుతో హెల్ప్‌లైన్‌ను బుధవారం నుంచి అందుబాటులోకి తీసుకురాగా.. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

10న నవోదయ ప్రవేశ పరీక్ష

నిజాంసాగర్, ఫిబ్రవరి 7: నిజాంసాగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిది, పదకొండో తరగతిలో ఉన్న ఖాళీల భర్తీ కోసం నిర్వహించే పరీక్ష ఈనెల 10న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్ష కోసం ఉమ్మడి జిల్లాలో మొత్తం 11 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను మీ సేవ లేదా ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఇందల్వాయి ఎస్సైపై కేసు నమోదు

ఇందల్వాయి, ఫిబ్రవరి 7 : ఇందల్వాయి ఎస్సై మహేశ్‌పై కేసు నమోదైంది. ఉన్నతస్థాయిలో విధులు నిర్వహిస్తూ పెండ్లి చేసుకుంటానని ఓ మహిళను మోసం చేయగా.. బాధితురాలు పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు ఎస్సైపై కేసు నమోదు చేశారు. ఎస్సైగా పని చేసిన చోటనే ఆయనపై కేసు నమోదుకావడం గమనార్హం.

కామారెడ్డి మున్సిపల్‌లో 'విజిలెన్స్' తనిఖీలు

కామారెడ్డి, ఫిబ్రవరి 7 : కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. మున్సిపల్‌లో జరిగిన అక్రమాలపై గతంలో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి బీజేపీ కౌన్సిలర్లతో కలిసి ఆందోళన చేపట్టారు. సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని సేకరించి ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడంతో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం విజిలెన్స్ అధికారులు మున్సిపల్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి, రికార్డులను తీసుకొని పంచనామాకు వెళ్లారు.దీనిపై మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌ను వివరణ కోరగా గతంలో విజిలెన్స్ అధికారులు రికార్డులను పరిశీలించారని, వాటిని తిరిగి పరిశీలించడానికి వచ్చారని తెలిపారు

వరుస కిడ్నాప్‌లు.. అప్రమత్తమైన ప్రజలు

తిమ్మాపూర్‌లో గుర్తుతెలియని వ్యక్తికి దేహశుద్ధి

తిమ్మాపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తి కాళ్లు చేతులు కట్టివేసిన గ్రామస్తులు

మోస్రా (చందూర్), ఫిబ్రవరి 7: నిజామాబాద్ జిల్లాలో వరుస కిడ్నాప్‌ల నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు అప్రమత్తమయ్యారు. చిన్న పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా జిల్లాలో సంచరిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఎవరైనా అపరిచితులు కనిపిస్తే చాలు ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు అడిగి తెలుసుకొంటున్నారు. ఈ క్రమంలో మోస్రా మండలంలోని తిమ్మాపూర్‌లో బుధవారం చాక్లెట్లు పట్టుకొని తిరుగుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తికి గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పజెప్పారు. పిల్లల పట్ల వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులకు పోలీసులు ఈ సందర్భంగా సూచించారు.